క్లుప్తంగా

మాజీ డిప్యూటీ సీఎంకు నివాళి


జగన్నాథరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబీకులు, ఆయా పార్టీల నాయకులు

నర్సాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం దివంగత చౌటి జగన్నాథరావుకు ఆయన కుటుంబసభ్యులు, ఆయా పార్టీల నాయకులు గురువారం నివాళులర్పించారు. చౌటి జగన్నాథరావు 13వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి కుమారుడు, పీసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రావు, ఆయా పార్టీల నాయకులు రమణరావు, రిజ్వాన్, రవికుమార్, జగదీశ్వర్, శ్రీనివాస్‌రావు, సురేశ్, శ్రీనివాస్‌గుప్తా, అజ్మత్, శ్రీశైలంయాదవ్, రషీద్, దశరథ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేశారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు చాకలి ఆశయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, గ్రామసభల్లో ప్రజలు ఆ పార్టీని నిలదీస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ రమేశ్, మాజీ ఎంపీటీసీ దత్తు, మానిక్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రవీందర్, కిషన్, కోణం అంజయ్య, వెంకట్‌రెడ్డి కిషన్ సేట్ తదితరులున్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో నిర్వహిస్తున్న నర్సరీని ఆమె పరిశీలించి కూలీలకు, సిబ్బందికి సూచనలందించారు. మొక్కలు పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని, గతంలో నాటిన మొక్కలను సంరక్షించాలని, గ్రామాలకు అవసరమైన మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఫొటో పెట్టాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ


మాట్లాడుతున్న సంజీవ

కౌడిపల్లి(నర్సాపూర్): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బీఆర్ అంబేడ్కర్ ఫొటోను పెట్టాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రాసిన మహానుభావుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో జరిగే జాతీయ జెండా ఆవిష్కరణలో అంబేడ్కర్ ఫొటో పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, జిల్లా యూత్ అధ్యక్షుడు నరేష్, కౌడిపల్లి, నర్సాపూర్, చిన్నశంకరంపేట మండల అధ్యక్షులు కుమార్, యాదగిరి, బేగరి సంజీవ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదువుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ హాస్టల్ ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వార్డెన్ యాదగిరి అన్నారు. మండల కేంద్రం శివ్వంపేటలోని ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన బ్లాంకెట్స్‌ని గురువారం అందజేశారు.

వేతనాలు అందేనా?

3 నెలలుగా అందని జీతాలు

- ఆర్థిక ఇబ్బందుల్లో అర్చకులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 459 ఆలయాలు


పెద్దశంకరంపేట మండలం బద్దారం హనుమాన్ దేవాలయం

పెద్దశంకరంపేట(మెదక్): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ధూప, దీప నైవేద్య పథకం(డీడీఎన్‌ఎస్) కింద ఎంపిక చేయబడిన ఆలయాలకు నెలల తరబడి వేతనాలు విడుదల కావడంలేదు. దీంతో అర్చకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆలయాల్లో పూజాకైంకర్యాలకు నిరంతరం కొనసాగించేందుకు సరిపడా నిధులు లేకపోవడంతో అర్చకులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ప్రభుత్వం పురాతన ఆలయాల పునరుజ్జీవానికి ధూపదీపనైవేద్య పథకం(డీడీఎన్‌ఎస్)ను తీసుకొచ్చింది. ఈ మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితో పాటు ఎంపిక చేయబడిన డీడీఎన్‌ఎస్ అర్చకులకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వేతనాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,860 ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం కింద మంజూరు చేస్తూ ఏడాదిన్నర క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 6,271 ఆలయాలు డీడీఎన్‌ఎస్ పథకంలో ఎంపికయ్యాయి.

డీడీఎన్‌ఎస్ పథకం అర్చకులకు వరం

గతంలో భక్తులు ఇచ్చే దక్షిణలతోనే అర్చకులు ఆలయాల్లో నిత్యార్చన చేస్తూ కుటుంబాలను పోషించుకునేవారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ 2009లో ధూపదీప నైవేద్య పథకానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో నెలకు రూ.2500 వేతనంగా నిర్ణయించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 జూన్ 2 నుంచి ధూపదీప నైవేద్య అర్చకులకు రూ.6 వేల వేతనాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇందులో రూ.4 వేలు అర్చకుడి వేతనం, రూ.2 వేలు ఆలయ పూజాకైంకర్యాలకు కేటాయించాలి. అప్పట్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో మొదటి విడతలో 100, రెండో విడతలో 278 ఆలయాలను గుర్తించి డీడీఎన్‌ఎస్ పథకాన్ని వర్తింపజేస్తోంది. అనంతరం 2023లో ఏప్రిల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 2,860 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెదక్ జిల్లాలో 98, సంగారెడ్డి జిల్లాలో 190, సిద్దిపేట జిల్లాలో 171 ఆలయాలను గుర్తించి, వీటికి ధూపదీప నైవేద్య పథకంలో చోటు కల్పించారు. వేతనాలు రెగ్యులర్‌గా రాకపోవడంతో రాష్ట్ర అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ గారి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌రావులకు అర్చకులు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ప్రతీ నెల వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అర్చకులు కోరుతున్నారు.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం

డీడీఎన్‌ఎస్ పథకంలో ఎంపికైన అర్చకులకు ప్రతీ నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నెలనెలా వేతనాలు ఇవ్వాలి. మూడు నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలి. .

– వేణుస్వామి, అర్చకుడు, పెద్దశంకరంపేట

ఉన్నతాధికారులకు తెలియజేశాం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధూపదీప నైవేద్య పథకంలో అర్చకులకు సంబంధించిన పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రతీ నెల అర్చకులకు సంబంధించిన హాజరును ఉన్నతాధికారులకు నివేదిస్తుంటాం. త్వరలో వేతనాలు వారి ఖాతాల్లో జమచేస్తాం.

– చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, సంగారెడ్డి


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్ లలిత, పార్టీ నాయకులు

అర్హులందరికీ పథకాలు అందాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ, ఏడవ, 12వ వార్డుల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఆమె మాట్లాడుతూ.. జాబితాలో పేర్లు లేని వారి నుంచి దరఖాస్తులు తీసుకొని అందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డు సభల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్ సురేష్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా మున్సిపాలిటీ పరిధిలో 2,9,14, 15వ వార్డుల్లో వార్డు సభలు ఏర్పాటు చేయగా, ఆయా వార్డుల కౌన్సిలర్లు లత, సరిత, లలితతో పాటు వార్డు అధికారులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మురికి కాల్వ నిర్మాణానికి భూమి పూజ

పట్టణంలోని 9వ వార్డులో రూ.35లక్షలతో మురికి కాల్వ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి భూమిపూజ చేశారు. పట్టణ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్ లలిత, బీఆర్‌ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, భిక్షపతి, నర్సింలు, నాగరాజుగౌడ్, జ్ఞానేశ్వర్, రాకుష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు గురువారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉసిరికపల్లి గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారావు, జనార్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం


నార్సింగి కార్మికులను సన్మానించిన సామాజిక సమరత నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం సామాజిక సమరత జిల్లా ఆర్గనైజర్ బైరం నర్సింలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన సామాజిక సమరత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రముఖ్ అముద వెంకటేశం, ఖండ ప్రముఖ్ నవీన్, సోమరాజు, సత్యపాల్‌రెడ్డి, సతీష్, సాయి, రాజు, కార్మికుల సంఘం గ్రామాధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

నేతాజీ అడుగుజాడల్లో నడవాలి

జిల్లా వ్యాప్తంగా గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి స్వాతంత్ర్య సంగ్రామంలో కనబరిచిన పోరాట పటిమను స్మరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. నేతాజీ కన్న కలల్ని సాకారం చేసేందుకు విద్యార్థులు, యువత ముందుకు రావాలన్నారు.


తూప్రాన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు


మనోహరాబాద్‌లో..


పెద్దశంకరంపేటలో..

అందరి అభ్యున్నతికి ప్రధాని కృషి

నర్సాపూర్: దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రధాని కృషి చేస్తున్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అన్నారు. సంవిధాన్ గౌరవ్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ అంబేడ్కర్‌కు రమేశ్‌గౌడ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు గురువారం నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట పార్టీ నాయకులు రమణారావు, బుచ్చేష్‌యాదవ్, ఆంజిగౌడ్, రాజేందర్, బాల్‌రాజ్, గుండం శంకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే బీజేపీ లక్ష్యం

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులైన పేద, మధ్య కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దరిచేయడమే బీజేపీ లక్ష్యమని బీజేపీ మండలాధ్యక్షుడు రవి అన్నారు. సంవిధాన్ గౌరవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చెన్నాపూర్ అంబేడ్కర్ కాలనీలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి కాలనీ వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భిక్షపతి, అశోక్, భాస్కర్, తదితరులు ఉన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనర్హులకే ఇస్తుండ్రు

- గందరగోళంగా గ్రామ సభలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్ల రెండు పథకాల్లో తయారు చేసిన లబ్ధిదారుల జాబితాలో అందరూ అనర్హులే ఉన్నారంటూ వాటి రద్దు కోసం తీర్మానం చేశారు. అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారులు మధుమోహన్, నవీన్ ప్రజలను కోరడంతో సమస్య సద్దుమనిగింది.

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని గొట్టిముక్కుల, మక్తలక్ష్మాపూర్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లితో పాటు వెల్మకన్న, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో గ్రామసభలు రసాభాసగా జరిగాయి. కౌడిపల్లి రైతువేదికలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు వచ్చాయని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. వెల్మకన్నలో సైతం ప్రభుత్వ పథకాలు అనర్హులకు వచ్చాయని అధికారులను గ్రామస్తులు నిలదీశారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో మెదక్ ఆర్డీఓ రమాదేవి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి యోగీశ్వర్ పాల్గొన్నారు.

ఆందోళన చెందొద్దు

నిజాంపేట(మెదక్): ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో అర్హుల పేర్లు లేకపోతే ఆందోళన చెందొద్దని, తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాజిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్మెడ, నిజాంపేట, కల్వకుంట, నందిగామ గ్రామాల్లో నాలుగు పథకాలపై గ్రామసభల నిర్వహించి జాబితాలో ఉన్న పేర్లను చదివి వినిపించారు.

అధికారులతో మొరపెట్టుకున్న దరఖాస్తుదారులు

నర్సాపూర్ రూరల్: రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఆయా గ్రామాల దరఖాస్తుదారులు మూడోరోజు గురువారం మండలంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో తమ పేర్లు లేకపోవడంతో దరఖాస్తుదారులు అధికారులతో మొరపెట్టుకున్నారు. మండలంలోని కాగజ్ మద్దూర్, ఎల్లాపూర్, రామచంద్రాపూర్, అచ్చంపేట, లింగాపూర్, రుస్తుంపేట, మంతుర్, పిల్లికుంట తండాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామ సభల్లో ఎంపీడీఓ మధులత, ఎంపీఓ వైద్య శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): ఇరువర్గాలను నియంత్రిస్తున్న పోలీసులు

గోమారంలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభ రసాభాసగా మారింది. అర్హులు పేర్లు లిస్టులో రాలేదని బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే సక్రమంగా చేయ్యలేదన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులకు, బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో పోలీసులు కల్పించుకొని ఇరువర్గాలను నియంత్రించారు. దంతన్‌పల్లి గ్రామ సభలో సైతం పథకాల్లో అర్హుల పేర్లు లేవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

పాలాటలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పాలాట, చెట్లగౌరారంలో గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి నర్సింలు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు.

అనంతసాగర్ గ్రామసభలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని అనంతసాగర్ గ్రామసభలో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్, సోమక్కపేట్, చిట్కుల్, గౌతాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు గందరగోళంగా మారాయి. ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా పథకంలో భూమి ఉన్నవారి పేర్లు, ఉపాధిహామీలో పని చేయని వారి పేర్లు ఉండడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. చండూర్ గ్రామంలో అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన పేర్లు చదవడం మొదలు పెట్టగానే, గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన పలు పథకాలలో పేర్లు రాని వారు ఉంటే, తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.


కౌడిపల్లి గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు మధ్య వాగ్వాదం

దరఖాస్తు నిరంతర ప్రక్రియ

టేక్మాల్(మెదక్): ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విఠల్ తెలిపారు. గురువారం టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లిలో గ్రామసభ నిర్వహించి ప్రభుత్వ పథకాలను గురించి వివరించారు. మండల కేంద్రం టేక్మాల్‌లో ఎంపీఓ రియాజొద్దీన్, ఈఓ రాకేశ్ సమావేశాన్ని నిర్వహించి లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. ప్రభుత్వ పథకాల దరఖాస్తు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప, అధికారులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో రసాభాస..

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టడానికి వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభ రసాభాసగా మారింది. ఆయా పథకాలకు సంబంధించిన ముసాయిదా జాబితాపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేర్లు పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి చదువుతుండగానే జాబితాలో అర్హుల కంటే అనర్హుల పేర్లు అధికంగా ఉన్నాయని జాబితాలో పేర్లు లేనివారు బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన నాయకులు ఆరోపించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడంతో గ్రామసభ గందరగోళంగా మారింది. అనంతరం ఆయా పథకాల్లో అర్హత ఉండి పేర్లు రానివారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.


హవేళిఘణాపూర్(మెదక్): కూచన్‌పల్లిలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు


నర్సాపూర్ రూరల్: కాగజ్ మద్దూర్ గ్రామసభలో లబ్ధిదారుల పేర్లు వినిపిస్తున్న అధికారులు


తూప్రాన్: పడాల్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత పశు వైద్య శిబిరం



శివ్వంపేట(నర్సాపూర్): పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తగా ఉండాలని శివ్వంపేట పశు వైద్యాధికారి సంధ్యారాణి అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్యాధికారి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పశువులు అనారోగ్యానికి గురైతే నాటు వైద్యం చేయకుండా పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, సిబ్బంది రమాదేవి, గణేశ్, తదితరులు ఉన్నారు.

◆ దాతల సాయం వెలకట్టలేనిది

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థుల కోసం దాతలు అందిస్తున్న సాయం వెలకట్టలేనిదని ఎంఈఓ బుచ్చానాయక్ అన్నారు. మండల పరిధిలోని గూడూర్‌లోని కస్తూర్బా బాలికల వసతిగృహం విద్యార్థినులకు హైదరాబాదుకు చెందిన ఫ్లవర్ ప్రాజెక్టు ఆర్గనైజర్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడంతో పాటు ఏకో ఫ్రెండ్లీ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా దాతలు భావన, సిగ్ధకు ఉపాధ్యాయులు, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మంజుల, తదితరులు ఉన్నారు.

◆ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో నస్కల్ గ్రామానికి రోడ్డు వేయాలని గ్రామస్తులు చేసే రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం బాధాకరమని గ్రామస్తులు మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించని యెడల ధర్నాలు రాస్తారోకోలు, వంటావార్పు, ఇంకా వినూత్న రీతిలో నిరసనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తీగల శ్రీనివాస్‌గౌడ్, శాల రాజు, చాకలి శ్రీనివాస్, దేశెట్టి చంద్రయ్య, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ భగీరథ పైపులైన్ లీకేజీ

నర్సాపూర్: పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయింది. దీంతో వారం రోజుల నుంచి భగీరథ నీరు రోడ్డుపై పారుతోంది. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా.. మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆరోపించారు. పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా పోతున్నందున మరమ్మతులు చేసి, నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

◆ నిరుపేదలకే పథకాలు అందించండి



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో అనర్హులకు పథకాలు ప్రకటించారని, నిరుపేదలకే పథకాలు అందించాలని గ్రామ మహిళలు ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం గురువారం అందజేశారు. కూచారం గ్రామంలో పంచాయతీ కార్యలయం వద్ద కార్యదర్శికి సైతం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం పారదర్శకంగా ఎంపిక చేస్తారని ప్రకటనలకే పరిమితమయ్యారని, ఉన్న వారికే పథకాలు వచ్చేలా లబ్ధిదారుల పేర్లు ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ఘనంగా చేతిరాత దినోత్సవం

దుబ్బాకటౌన్: అందమైన చేతిరాతతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని హెచ్‌ఎం సాదత్ అలీ అన్నారు. ధర్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా జాతీయ చేతిరాత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చేతిరాత ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడతూ విద్యార్థులు చదువుతోపాటు చేతిరాతపై కూడా దృష్టి సారించాలన్నారు.